క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను నగర మేయర్ పునుకొల్లు నీరజ లబ్ధిదారులకు అందజేశారు. సోమవారం 51వ, 52వ డివిజన్లలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రభుత్వం రెండు కళ్లలా కొనసాగిస్తుందన్నారు. లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో మంత్రి తుమ్మల ఇంటికే చెక్కులను పంపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎనమండల శ్రీదేవి, చెరుకూరి ఉష, తుపాకుల త్రివేణి, ముంగి స్వప్న, బత్తుల శ్రీదేవి, నాగమణి, భవ్య పాల్గొన్నారు.

రక్తదాతలకు సర్టిఫికెట్లు..

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని అంకుర ఆస్పత్రిలో సోమవారం ఆయు ఫౌండేషన్, విజశ్రీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతకు ఆస్పత్రి సీఈఓ డాక్టర్ ఉన్నం కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.రాకేష్ సర్టిఫికెట్లు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని, అందుకు యువత ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఆస్పత్రి వైద్యులు జోత్స్న, సింధు, అపర్ణ, కల్పన, జాకీర్, కోటేశ్వరరావు, శ్వేత, మేనేజర్ కందిమళ్ల రామారావు, నాగండ్ల అన్వేష్, యువం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కుక్కల రాజా, మహేష్ పాల్గొన్నారు.

అనాసాగరం వాసికి అవార్డు



వీరబాబును సన్మానిస్తున్న ప్రతినిధులు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన కవి చిలకబత్తిని వీరబాబుకు కవి సామ్రాట్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో విశ్వ ఆర్ట్స్, మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయనకు అవార్డు అందజేసి సన్మానించారు. ఈమేరకు స్థానికులు వీరబాబును గ్రామంలో సన్మానించగా, జెర్రిపోతుల సత్యనారాయణ, తెల్లగొర్ల లింగస్వామి, కాసాని నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందించాలి

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాభావంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలను పంపిణీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 వేల ఎకరాల్లో మొలకెత్తిన పత్తి, పెసర దెబ్బతిన్నాయని, విత్తనాలు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు ఎస్‌కె. మీరా, రచ్చా నరసింహారావు, బిక్కసాని గంగాధర్, దొడ్డపాటి నాగేశ్వరరావు, గుడూరు ఉమా, బిగ్గి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వార్డుల్లో పేరుకుపోయిన చెత్త, మెడికల్ వేస్ట్



అధ్వానంగా దర్శనమిస్తున్న పెద్దాస్పత్రి పరిసరాలు

కంపు..కంపు..

దుర్వాసన వెదజల్లుతున్న పెద్దాస్పత్రి వార్డులు

- కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే
- మూడు నెలల జీతాలు చెల్లించకపోవడంతో విధుల బహిష్కరణ
- మున్సిపల్ కార్మికులను అడ్డుకున్న వైనం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, రోగులు

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని గత సోమవారం నుంచి పెద్దాస్పత్రి కార్మికులు సమ్మె బాటపట్టారు. మూడు నెలల పెండింగ్ జీతాలు చెల్లించే వరకూ విధుల్లో చేరేది లేదని కార్మికులు తెగేసి చెప్పడంతో ఆస్పత్రి అంతా అధ్వానంగా తయారైంది. అప్పటి నుంచి మున్సిపల్ కార్మికులు వచ్చి ఆవరణలోని చెత్త ఎత్తుతున్నా, పూర్తిస్థాయిలో శుభ్రపరచకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రోగులు, వైద్యులు, సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారం ఉన్నతాధికారుల చేతిలో ఉండడంతో ఆస్పత్రి అధికారులు ఏమీ చేయలేక తలలు పట్టుకుంటున్నారు. అంతేకాక పారిశుద్ధ్య సమస్యతో పాటు సేవలు అందించటంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కొత్త రోగాలకు నిలయంగా..

పెద్దాస్పత్రిలో రోగుల పరిస్థితి కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక పోయిందన్న చందంగా తయారైంది. పెద్దాస్పత్రికి నిత్యం వందలాది మంది బాధితులు వస్తుంటారు. ఈనేపథ్యాన ఆస్పత్రిలో రోగం నయం చేయడం దేవుడెరుగు కొత్త రోగం అంటించుకోవడం కోసమే వస్తున్నట్లుగా పరిస్థితి తయారైంది. శుభ్రం చేసే వారు లేకపోవడంతో మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. చెత్త, చెదారం, మెడికల్ వేస్ట్ వంటివి ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రిలో రోగులతో పాటు వైద్యులు, సిబ్బంది కూడా ఎక్కువ సేపు ఉండలేకపోతున్నారు. వార్డుల్లో నుంచి వచ్చే దుర్వాసనతో కొందరు రోగులు వాంతులు చేసుకుంటున్నారు. కొత్తరోగాలు అంటుకునే పరిస్థితులు దాపురించారు.

ఏడాదిన్నరగా సమస్య..

పెద్దాస్పత్రిలో పేషంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల్లో కలిపి 259 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ఓ ఏజెన్సీ ద్వారా జీతాలు చెల్లింపులు జరుగుతున్నాయి. పెద్దాస్పత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న సమయాన జీతాలు చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. 2023 నవంబర్ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్లిపోయింది. డీఎంఈ పరిధిలో కన్నా ముందు ఆస్పత్రిలో 575 పడకలకు అనుమతి ఉండడంతో పడకల ప్రకారం 259 మంది కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. ఆ ప్రకారంగా జీతాలు నెల అటూ ఇటూ అయినా సక్రమంగా చెల్లించేవారు. అయితే డీఎంఈ పరిధిలోకి వచ్చిన తర్వాత ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం 430 పడకలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. దీంతో గతంలో జీతాల కోసం కాంట్రాక్టర్‌కు చెల్లించే రూ.50 లక్షలకు బదులు రూ.35 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో డీఎంఈ పరిధిలోకి వెళ్లినప్పటి నుంచి కాంట్రాక్టర్ తన సొంత డబ్బులు కలిపి చెల్లిస్తూ వస్తున్నాడు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లల్లో పేరుకుపోవడంతో ఆయన ఇక చెల్లించడం సాధ్యం కాదని చేతులెత్తేశాడు. అయితే ప్రభుత్వం నుంచి 575 పడకలకు అనుమతులు ఇంకా రాకపోగా, ఇచ్చే జీతాలు కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో కార్మికులకు ఈ నెలతో కలుపుకుంటే నాలుగు నెలల జీతం చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన కార్మికులు సమ్మెబాట పట్టడంతో ఆస్పత్రి అంతా కంపు కొడుతుండడంతో ఇన్ అండ్ ఔట్ పేషంట్లు నానా అగచాట్లు పడుతున్నారు.

నిలిచిన శస్త్ర చికిత్సలు..

ఆస్పత్రిలో గత వారంగా శస్త్ర చికిత్సలు నిలిపివేశారు. ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్సలు జరగాలంటే కార్మికులదే ముఖ్య పాత్ర. సహాయకులుగా, ఆపరేషన్ థియేటర్‌లోని వేస్ట్‌ను తొలగించడం, తరచూ శుభ్రం చేయడంతో పాటు పలు రకాల పనులు వీరే నిర్వహిస్తారు. కార్మికుల సమ్మెతో ఆపరేషన్ థియేటర్ వెల వెల బోతోంది. శస్త్ర చికిత్సలు అందుబాటులో లేక రోగులు ప్రైవేట్ బాట పడుతున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు చేసేదేమి లేక మరింత నరకం అనుభవిస్తున్నారు. అలాగే మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో డెలివరీల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టాయి. అత్యవసరమైన వాటిని నిర్వహిస్తున్నా, కార్మికులు లేకపోవడం వల్ల పూర్తిస్థాయిలో డెలివరీలు చేయలేకపోతున్నారు.



వెలవెలబోతున్న ఆపరేషన్ థియేటర్

జీతాలు చెల్లిస్తేనే విధుల్లోకి..

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కార్మికులు సోమవారం ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలల జీతాలు చెల్లించే వరకూ దీక్ష విరమించేది లేదని కొందరు కార్మికులు నిరాహార దీక్షకు దిగారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ దీక్ష వద్దకు వచ్చి డీఎంఈ నుంచి చెక్కు వచ్చిందని, మూడు రోజుల్లో జీతాలు చెల్లిస్తామని చెప్పినా వారు వినలేదు. ఇలాంటి మాటలు ఏళ్లుగా వింటున్నామని, శాశ్వత పరిష్కారం లభించే వరకూ దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, ఆస్పత్రిని శుభ్రం చేయించేందుకు అధికారులు మున్సిపల్ కార్మికులను పిలిపించగా.. దీక్షకు మద్దతు తెలపకుండా చెత్త ఎలా ఎత్తుతారని వారు అడ్డుకోవడంతో తిరిగి వెళ్లిపోయారు. కార్మిక సంఘాల ఆధ్వర్యాన బుధవారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని నాయకులు స్పష్టం చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సమస్యలపై వినతుల వెల్లువ..

కలెక్టర్‌కు..

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ సవరణ బిల్లు చట్టంగా రూపొందితే పెన్షనర్లకు కలిగే నష్టాలపై సోమవారం ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు, టీఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు ఆధ్వర్యాన కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. పే రివిజన్ ద్వారా వచ్చే ఆర్థిక ఫలాలను సీనియర్లకు అందించకుండా జూనియర్లకు అందిస్తూ వారి మధ్య విభేదాలు సృష్టించేందుకే బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. నాయకులు తాళ్లూరి వేణు, కృష్ణయ్య, సుబ్బయ్య, జనార్దన్‌రావు, డీకే శర్మ, దుర్గాదేవి, పి.సాంబశివరావు, మొయినుద్దీన్, ఎస్.పూర్ణచంద్రరావు, పి.రాజారావు, మారంరాజు రాధాకృష్ణరావు, ఆర్.వెంకటనారాయణ, కృష్ణమూర్తి, బాబురావు పాల్గొన్నారు.

ఆర్‌సీఓకు..

విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన సోమవారం బీసీ గురుకుల జిల్లా అధికారి ఆర్‌సీఓ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ మాట్లాడుతూ.. రఘునాథపాలెం మహిళ బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఇంగ్లిష్ లెక్చరర్ తన ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని, వెంటనే ఆ లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి అందించిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జగదీష్ నాగరాజు, విద్యార్థిని తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఒకే ఆవరణలో నిర్వహించడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక బీజేపీ నాయకులు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే కూసుమంచిలోని ప్రాథమిక పాఠశాలలో సరిపడా తరగతి గదులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డితో పాటు మంద చంద్రశేఖర్, పిట్టల వేణు, ఆడెపు మధు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమామిళ్లగూడెం: కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

సీడీపీఓకు..

కామేపల్లి: ఇటీవల విధి నిర్వహణలో భాగంగా సమావేశానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గాదెపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ షేక్ మహబూబ్‌బీ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ పండితాపురంలోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ధర్నా చేశారు. ఆమె కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబసభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, సీడీపీఓ అంగన్‌వాడీ టీచర్లపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీఓ దయామణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దుగ్గి పాపారాణి, కృష్ణ, గడ్డమీద నరేందర్, బాదావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

కూసుమంచి/ఖమ్మంమామిళ్లగూడెం: భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను పురస్కరించుకుని పాలేరు, కూసుమంచిలోని శివాలయంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పాలేరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా రవికుమార్ మాట్లాడగా, కూసుమంచిలో నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. అలాగే ఖమ్మం జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి టూటౌన్ 111వ పోలింగ్ బూత్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నేతలు దేవకి వాసుదేవరావు, అల్లిక అంజయ్య, గంట్యాల విద్యాసాగర్, గుత్తా వెంకటేశ్వరరావు, సరస్వతి, చంద్రశేఖర్, పుణ్యవతి, రవి రాథోడ్, మల్లారెడ్డి, దాసరి వెంకన్న పాల్గొన్నారు.



పాలేరులో మొక్క నాటుతున్న నాయకులు

మాదక ద్రవ్యాలతో జీవనంపై దుష్ప్రభావం

మాదక ద్రవ్యాల వాడకంతో మనిషి జీవన విధానంపై దుష్ప్రభావం పడుతుందని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

- **ఖమ్మంక్రైం:** నగరంలోని రెజొనెన్స్ కాలేజ్ విద్యార్థులకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే నష్టాలపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఆర్‌ఐ సాంబశివరావు, ఎస్సై రవి, సాగర్ పాల్గొన్నారు.
- **ఖమ్మం సహకారనగర్/ఖమ్మంఅర్బన్:** నగరంలోని డైట్ కళాశాలలో విద్యార్థులకు ఖానాపురం హవేలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాల మురళి, సూపరింటెండెంట్ ఎస్.ప్రసాద్, సిబ్బంది ఎర్రమళ్ల శ్రీనివాసరావు, పద్మ, నగేష్, సైదులు, సుధీర్, సత్యం, టి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ, తదితరులు



మొక్క నాటుతున్న సీఐ భానుప్రకాష్

- **ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలోని 17వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో నషా ముక్తి అభియాన్ (ఎన్‌ఎంబీఏ) సంస్థ ఆధ్వర్యాన డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు.
- **రఘునాథపాలెం:** మండల కేంద్రమైన ఎంజేపీటీ బాయ్స్ హైస్కూల్‌లో సీఐ ఉస్మాన్ షరీఫ్ విద్యార్థులకు అవగాహన కల్పించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు ఇస్తాం..



మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: గూడులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 532 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుపత్రాలను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ పథకాలన్నింటిని అమలు చేస్తూ అర్హులైన పేదలకు అందిస్తున్నామన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతాల్లో పంటసాయం పెట్టుబడి జమ చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని, అందుకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, మద్దినేని రమేశ్‌బాబు, ఆరెం రవి, నల్లమోతు లక్ష్మయ్య, ధరావత్ అనురాధ, గుగులోత్ గబ్రూనాయక్, మాలోత్ బావ్‌సింగ్, ప్రేమ్‌కుమార్, తోటకూరి భద్రయ్య, బానోత్ నరసింహానాయక్, దేవండ్ల నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాతలూ చేయూత ఇవ్వండి...

ఖమ్మం అర్బన్: ఖమ్మం అర్బన్ మండలం పాపటపల్లికి చెందిన పెయింటర్ ఎస్.కే.షఫీ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈనెల 21న పని నుంచి ఆయన తిరిగి వస్తుండగా కుక్కలు వెంటపడటంతో వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన షఫీని కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స కోసం రూ.6లక్షలకు పైగా అవసరమని వైద్యులు వెల్లడించారు. రోజూ పనికి వెళ్తేనే జీవనం సాగించే కుటుంబమైనందున దాతలు చేయూతనివ్వాలని షఫీ సోదరుడు రఫీ కోరారు. సాయం చేయదలిచిన వారు 97010 52552 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'రైతు భరోసా' జమపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. తొమ్మిది రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా సాగు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయంగా రూ.9 వేల కోట్లు జమ అయ్యాయని పేర్కొన్నారు. ఈమేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జిల్లా పార్టీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రైతు భరోసా అమలుపై జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు రైతులతో కలిసి సంబరాలు నిర్వహించాలని దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



భాస్కర్‌ను సత్కరిస్తున్న దుర్గాప్రసాద్, నాయకులు

ఇటీవల మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కాంగ్రెస్ నాయకుడు తొగరు భాస్కర్ సోమవారం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను కలవగా ఆయనను సన్మానించారు. నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, షేక్ రజ్జీ, అల్లే సాయికిరణ్, విభూది సురేష్, గోనెల రవిశంకర్, తొగరు రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఇళ్ల మంజూరుకు ధర్నా



ధర్నా చేస్తున్న పిండిప్రోలు గ్రామస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీల ఆధ్వర్యాన సోమవారం తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట స్థానికులు ధర్నా చేశారు. తొలుత ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి ధర్నా అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బీఆర్‌ఎస్ మండల నాయకుడు చామకూర రాజులు మాట్లాడగా.. కార్యక్రమంలో నాయకులు పద్మనాభుల సుధాకర్‌రావు, చల్ల వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, కాంపాటి బాబూరావు, పప్పుల ఉపేందర్, పిట్టల పాపారావు, వీరస్వామి, చంద్రశేఖర్, నిర్మలరావు, వెంకట్రావు, నాగేశ్వరరావు, నరేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలో ఖమ్మం జిల్లాకు సంబంధించిన జి.రామయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, పుల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హమాలీలు, ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సింగరేణి, ఆర్టీసీ రంగాలను ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, ఎల్‌ఐసీ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని రద్దు చేయాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జీతాలు చెల్లించాలని సమ్మె చేస్తున్న పెద్దాస్పత్రి కార్మికులకు తమ మద్దతు ప్రకటించారు.

కూలీలకు సమగ్ర చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మంరూరల్: వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు వారీ వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. మండలంలోని కామంచికల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం తమ కష్టాన్నే నమ్ముకుని వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలను పాలకులు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూమి లేని పేదలకు ఏడాదికి రూ.12వేలు అమలు చేయాలని, కేరళ ప్రభుత్వ తరహాలో 14 రకాల నిత్యావసర వస్తువులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వీరమ్మ, సావిత్రి, లక్ష్మి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి



రఘునాథపాలెంలో సభ్యత్వం అందిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు


కూసుమంచి/రఘునాథపాలెం: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సంక్షేమానికి టీఎస్‌యూటీఎఫ్ కృషి చేస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మండవ నర్సయ్య అన్నారు. సోమవారం కూసుమంచి మండలంలోని పలు పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా నర్సయ్య పాల్గొని మాట్లాడారు. అలాగే రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన క్యాంపెయిన్‌లో నాగేశ్వరరావు మాట్లాడారు. గత ఐదు దశాబ్దాలుగా పెండింగ్ బిల్లులు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల శాఖాధికారులు సతీష్, సత్రాం, శేషగిరి, శిరీష, వెంకటేశ్వరరావు, దాస్, రామోజీ, కిరణ్, శ్రీనివాసరావు, చిలకల శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, నాగలక్ష్మి, నాగరాజు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ ఇంద్ర ధనుష్' విజయవంతం

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలం మంచుకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యాన నగరంలోని పాండురంగాపురం, వేపకుంట్ల గ్రామాల్లో చేపడుతున్న మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంచార జాతులు, మురికివాడలు, ఇటుకబట్టీలు, నది పరీవాహక ప్రాంతాల్లో నివసించే అర్హులైన గర్భిణులు, చిన్నారులు టీకాలు పొందేలా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు కొనసాగనుందని, 12 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కోసం 11 రకాల టీకాలు ఇవ్వనున్నామన్నారు. సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, పద్మ, సత్యవాణి, పుష్ప, పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

కేఎంసీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ



సమస్యలు వింటున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత అధికారులకు అందించి వెంటనే పరిష్కరించాలని, వాటి స్థితిని ఫిర్యాదుదారులకు తెలియజేయాలని ఆదేశించారు.

డివిజన్లలో పారిశుద్ధ్య పనులు..

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నగరంలోని 15వ, 31వ, 39వ, 55వ డివిజన్లలో గ్యాంగ్ వర్కర్లతో పారిశుద్ధ్య పనులు చేయించారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించడంతో పాటు డ్రెయినేజీలు, రోడ్లను శుభ్రం చేయించారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన..

46వ డివిజన్‌లో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులను డీఈఈ పరిశీలించారు. పనులు నాణ్యతతో పూర్తి చేసేలా సిబ్బందికి, కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు.

వార్డు ఆఫీసర్లకు అదనపు బాధ్యతలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో ఇద్దరు వార్డు ఆఫీసర్లకు ఇన్‌చార్జ్ ఆర్‌ఐలుగా బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆర్‌ఐలుగా విధులు నిర్వర్తిస్తున్న రాంబాయి, జ్యోతిలను ఆ బాధ్యతల నుంచి తప్పించి, వారి స్థానంలో వార్డు ఆఫీసర్లు రవీందర్, నాగరాజులకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

అక్షరాభ్యాసం, సీమంతం వేడుకలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 46వ డివిజన్ సారధినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అక్షరాభ్యాసం, సీమంతం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ పాల్గొని మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వతభవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఎండీ.ఖాసీం ఆధ్వర్యాన రూ.10 వేల చొప్పున మొత్తం 30 మంది కుటుంబాలకు రూ.3 లక్షలను సోమవారం అందజేశారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి సొసైటీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, డైరెక్టర్ బలరాం, శేషయ్య పాల్గొన్నారు.